క్లుప్తంగా

నేటి నుంచి యూరియా పంపిణీ

కమలాపురం: కమలాపురం మండలంలో సోమవారం నుంచి యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఏఓ సరస్వతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కోగటం, దేవరాజుపల్లె, కమలాపురం-2 రైతు సేవా కేంద్రాల్లో ఒక్కో ఆర్‌ఎస్‌కేకు 7 టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రైవేట్ షాపులు నాగార్జున ఫర్టిలైజర్స్, లక్ష్మీ వెంకటేశ్వర, గ్రోమోర్ సెంటర్లలో యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఆయా కేంద్రాలలో యూరియా పంపిణీ చేస్తారని, కావలసిన రైతులు తీసుకెళ్లవచ్చని ఆమె తెలిపారు.

గంగమ్మ తల్లికి పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మ తల్లి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, నిమ్మకాయలు, వేపాకులు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులు, ముడుపులు చెల్లించుకున్నారు. అలాగే గంగమ్మ దేవాలయము సమీపంలోని వీరభద్రస్వామి, వైద్య నాదీశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

ఘనంగా దీపోత్సవం



పూజలు చేస్తున్న వైస్ చాన్సలర్ జి. విశ్వనాథ్ కుమార్ దంపతులు

వల్లూరు: మండల పరిధిలోని దుగ్గాయపల్లె, వెంకటాపురం వీవర్స్ కాలనీల్లో వెలసిన చౌడేశ్వరీ మాత ఆలయాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం దీపోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తితో పాటు ఉత్సవ విగ్రహానికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. దుగ్గాయపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో జరిగిన దీపోత్సవ కార్యక్రమంలో వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ జీ. విశ్వనాథ్ కుమార్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ప్రవక్త జీవితం ఆదర్శనీయం



సీరతున్నబీ పోటీలకు సంబంధించిన పత్రాలను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

కమలాపురం: మహ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శనీయమని మదీనా మస్జిద్ ఇమామ్ సయ్యద్ ఇమాం బాషా తెలిపారు. మిలాద్ ఉన్ నబీ మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని చిన్నచెప్పలి గ్రామంలోని మదీనా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీరతున్నబీ పోటీలు నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు. పొడదుర్తి మహబూబ్ బాషా, కె. సత్తార్, షరీఫ్, గఫార్, డి.సత్తార్, అబ్దుల్ రసూల్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



విద్యార్థులతో కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి

జమ్మలమడుగు: ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువాలని ఎస్వీ జూనియర్ కాలేజి కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కాలేజి విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య జీవితాన్ని మలుపు తిప్పుతుందన్నారు. ఈ రెండు సంవత్సరాలు బాగా చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని సూచించారు. ఒక పద్ధతి ప్రకారం చదివితే సులువుగా మంచి మార్కులు సాధిస్తారని సూచించారు.

దూదేకుల అభివృద్ధికి కృషి

ముద్దనూరు: దూదేకుల అభివృద్ధికి కృషి చేస్తామని దూదేకుల పొలిటికల్ జేఏసీ కడప జిల్లా కార్యదర్శి సిద్దు తెలిపారు. నూర్ బాషా ముస్లిం, దూదేకుల పొలిటికల్ జేఏసీ కడప జిల్లా కార్యదర్శిగా సిద్దు ఎంపికయ్యారు. మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన ఈయనను రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. తన ఎంపికకు కృషి చేసిన నూర్‌బాషా సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఇదేనా స్వచ్ఛత..?

- కంపుగొడుతున్న గ్రామాలు
- కానరాని పారిశుద్ధ్య పనులు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



టి. సుంకేసుల గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



పొట్లదుర్తిలో రోడ్డు పక్కనే చెత్తా, వ్యర్థాలు

ఎర్రగుంట్ల : స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర పేరుతో అధికారులు ప్రతి నెల మూడవ శుక్రవారం చేస్తున్న హడావిడి అంతా ఇంతా కాదు. ఆర్భాటంగా ఈ కార్యక్రమాన్ని చేస్తున్నారే తప్పా.. ఇది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. పారిశుద్ధ్య చర్యలు లేక పల్లెలు కంపుకొడుతున్నాయి. ఎక్కడపడితే అక్కడ మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. సిమెంట్ రోడ్లు, కాలువలు, అంతర్గత రోడ్ల నిర్మాణం ఊసే లేదు. దీంతో వానొచ్చినా.. ఇళ్ల నుంచి వాడుక నీరు రోడ్లపైకి చేరి నిలిచి ఉండిపోతోంది. అది కుంటలా మారి దోమలకు ఆవాస కేంద్రంగా మారుతోంది. గ్రామాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లెలవైపు కన్నెత్తి చూడడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వంటివి వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వీధులన్నీ మురికికూపాలే

మండల పరిధిలోని 17 గ్రామాలున్నాయి. ఇందులో తిప్పలూరు గ్రామ పంచాయితీలో టీ సుంకేసుల ఉంది. ఈ గ్రామంలో ఎటు చూసిన వీధులన్నీ మురికి నీటితో కంపుకొడుతున్నాయి. పైపులైన్ లీకులు అధికంగా ఉండటంతో రోడ్లన్నీ పాచి పట్టి ఉన్నాయి. పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్థానికులు అంటురోగాల బారిన పడకుండా ఉండేందుకు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని బ్లీచింగ్ చల్లించాలని ఎంపీడీఓలు, ఈఓపీర్డీలకు జిల్లా కలెక్టర్ పదేపదే ఆదేశాలించారు. అయినా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. గ్రామంలో రహదారులన్నీ మురుగునీటి ప్రవహిస్తోంది. పొట్లదుర్తిలో ప్రధాన రోడ్లు పక్కలోనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇలా మండలంలోని చాలా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. కలమల్ల, చిలంకూరు తదితర గ్రామాల్లో ఎటు చూసినా మురుగు నీరు స్తంభించిపోయింది. ప్రధాన రహదారులపై డ్రైయినేజీ ప్రవహిస్తోంది. ఆ నీటిలోనే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. అసలే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారటంపై స్థానికలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తమ బాధలు వర్ణనాతీతమని కనీసం బ్లీచింగ్ కూడా చల్లటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



గ్రామాల్లో పారిశుద్ధ్యం అటకెక్కింది. ఇటీవల వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. రోగాలతో చుట్టూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వీరికి మెరుగైన వైద్యం అందించాలి. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. ప్రజానీకం వ్యాధుల బారిన పడకుండా పల్లెల్లో చెత్తను తొలగించడంతో పాటు మురుగునీటిని బయటకు పంపి బ్లీచింగ్ చల్లాలి.

\- తమ్మిశెట్టి బాలయ్య, జెడ్పీటీసీ సభ్యులు, యర్రగుంట్ల మండలం

పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం



గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా పనులు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించాం. టీ.సుంకేసుల గ్రామంలో పారిశుద్ధ్య పనులకు రూ.5 లక్షలు నిధులు కూడా విడుదల య్యాయి. పల్లెల్లో మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ చల్లించాలని సిబ్బందికి సూచించాం.

\- రహమతుల్లయ్య, ఈఓపీఆర్డీ యర్రగుంట్ల మండలం

రైతులకు బాసటగా వైఎస్సార్‌సీపీ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, నాయకులు

పులివెందుల టౌన్ : ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై ఈ నెల 9న నిర్వహిస్తున్న రైతు పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు 9వతేదీ ఉదయం రైతులతో కలసి స్థానిక పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిర్వహించే ర్యాలీని పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం రైతులను అన్ని విధాల మోసం చేసిందన్నారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజుల్లా, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, నూర్‌బాషా సంఘ నాయకులు రసూల్, నూరుళ్ల, అంబకపల్లె నారాయణ స్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రమౌళి, కౌన్సిలర్లు మహేష్‌రెడ్డి, లక్ష్మీభార్గవి, పద్మనాభరెడ్డి, విజయ్‌భాస్కర్, చలపతి, శ్రీరాములు, ఆలయ చైర్మెన్ బ్యాటరీ ప్రసాద్, తోటంశెట్టి హరి, బీసీ సెల్ అధ్యక్షుడు కార్తీక్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు వేంపల్లె రవికుమార్‌రెడ్డి, వేముల నాగేళ్ల సాంబశివారెడ్డి, బయపురెడ్డి, మరక శివకృష్ణారెడ్డి, అంబకపల్లె బాబు, సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సింహాద్రిపురం శ్రీకాంత్, సైదాపురం సురేష్‌రెడ్డి, మల్లేల రవీంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు పోరు జయప్రదం చేయండి

వల్లూరు (చెన్నూరు): నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులురెడ్డి ఆధ్వర్యంలో కమలాపురంలో మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్న రైతు పోరును జయప్రదం చేయాలని చెన్నూరు వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. చెన్నూరులో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఆ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ యరసాని నిరంజన్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నేతలతో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడి మంజూరు కలగా మారిందని అన్నారు. పార్టీ నేతలు కొండపేట సర్పంచ్ తుంగ చంద్ర యాదవ్, సీనియర్ నాయకులు శ్రీనివాసులరెడ్డి, టీఎస్ చంద్ర రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు పాలగిరి ఉమా మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ చిన్న బాబు, రైతు సంఘం ఉపాధ్యక్షుడు యరసాని శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్ర, యూత్ ఉపాధ్యక్షుడు కార్తీక్ పాల్గొన్నారు.



వల్లూరు (చెన్నూరు): మాట్లాడుతున్న మండల కన్వీనర్ జీఎన్. భాస్కర్‌రెడ్డి, నాయకులు

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఉత్తమారెడ్డి, ప్రసాద్‌రెడ్డి

కమలాపురం: అన్నదాతలకు సకాలంలో ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, హార్టికల్చర్ స్టేట్ ఎక్స్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపడుతున్న రైతు పోరుబాటను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 9న కమలాపురంలో ఉదయం 9 గంటలకు గ్రామ చావడి నుంచి ప్రారంభమై ఏడీఏ కార్యాలయం వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు. రైతు ర్యాలీకి నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజుల రెడ్డి హాజరవుతారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల కాలంలో రైతాంగానికి మద్దతుగా నిలవడం లేదన్నారు. అన్నదాతలు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడులు అందక నష్టాలు మిగులుతున్నాయని అన్నారు. ఎన్నికల ప్పుడు అధికారం కోసం ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. జెడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్న కేశవరెడ్డి, మున్సిపల్ చైర్మన్లు మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మహ్మద్ సాదిక్, మాజీ సర్పంచ్ దేవదానం, నాయకులు కొండారెడ్డి, సత్యంరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శరత్ బాబు, విజయేంద్రారెడ్డి, సుబ్బన్న, సురేష్, మైసూరారెడ్డి, శివక్రిష్టారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సరోజ, హాజిమ పాల్గొన్నారు.

ఐఆర్, డీఏ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న రీజనల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి

జమ్మలమడుగు: ఐఆర్, డీఏ బకాయిలు చెల్లించాలని ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘ నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించలేదు. గతంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలతోపాటు రావలసిన బకాయిలు త్వరగా చెల్లించాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 10వ తరగతి పరీక్షల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు బకాయిలు చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్, కమిటీ కన్వీనర్ మహమ్మద్ గౌస్, నాయకులు దామోదర్, గౌస్, నూర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్నేహిత అమృత హస్తం సేవాసమితి' సేవలు ఆదర్శం



సేవాసమితి అధ్యక్షుడు రాజుతో ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సేవలు అందరికీ ఆదర్శమని హైకోర్టు న్యాయవాది మదిరే రంగసాయిరెడ్డి కొనియాడారు. కడప పట్టణంలో శ్రీహరి డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రజా సంకల్ప వేదిక విస్తృత సమావేశంలో రాష్ట్ర స్థాయి సేవా రత్న అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో రంగసాయిరెడ్డి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనేక విశిష్ట సేవా కార్యక్రమాలలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం గత 16 సంవత్సరాలుగా చేపడుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల కొరకు ఉచిత కోచింగ్‌లు, పలు విద్యాపరమైన సేవలు అమోఘమని పేర్కొన్నారు. ప్రజా సంకల్ప వేదిక జాతీయ అధ్యక్షుడు, రంగసాయిరెడ్డి, ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ కో ఆర్డినేటర్ విజయ చేతులమీదుగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు మొమ్మెల రాజుకి రాష్ట్ర స్థాయి సేవా రత్న అవార్డు తో ప్రశంసా పత్రంతో పాటు మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం డాక్టర్ శేష మహేశ్వరమ్మ, శ్రీదేవి, డాక్టర్ రాజమోహన్ రెడ్డి, వెంకటనారాయణ,అమర్ నాథ్ రెడ్డి, శ్యామ్ కుమార్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివ గంగాధర్ రెడ్డి, సేవాసమితి బందం శ్రీ రాజా కళానిలయం డాన్స్ మాస్టర్ రాజా, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, లింగాల మండల కో ఆర్డినేటర్ మస్తాన్ బాషా, బండారు రాజా, రాజు పాల్గొన్నారు.

రహదారులే మా అడ్డా

జమ్మలమడుగు: పట్టణంలో ప్రధాన రహదారులపై ఆవులు తిష్ట వేయడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. తాడిపత్రి, ముద్దనూరు, ప్రొద్దుటూరు మార్గాలతో పాటు మార్కెట్ పరిసరాల్లో ఆవుల సంచారం పెరిగిపోయింది. వీటి వల్ల తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. పశువుల సంచారం కారణంగా ట్రాఫిక్ కష్టాలు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీస్ సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. పశువుల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడితే యజమానులపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకూ ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆవుల సంచారం కారణంగా పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, దీనిపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఆవుల సంచారాన్ని అరికట్టే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆవులు అడ్డు రావడంతో వాహనాన్ని నిలిపిన డ్రైవర్



నేడు అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం

వేంపల్లె: ఫిజియోథెరపీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. అయితే ఆధునిక రూపం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పుట్టింది. అప్పుడు గాయాలైన సైనికులను పునరావాసం కల్పించడానికి, వారి కదలికలను పునరుద్ధరించడానికి ×ఫిజికల్ థెరఫీ లేదా ×జిమ్నాస్టిక్స్ అని పిలిచే వ్యాయామాలు ఉపయోగించారు. తర్వాత 'ఫిజియోథెరపీ' అనే పేరు స్థిరపడింది.

పురాతన కాలం నుంచి ప్రారంభం

గాయం, వ్యాధుల కారణంగా కదలికలు కోల్పోయిన వారికి శారీరక వ్యాయామాల ద్వారా సహాయం చేసే పద్ధతి చాలా కాలం క్రితం నుంచి ఉంది. ప్రాచీన నాగరికతలో కూడా కదలికలను మెరుగుపరచడానికి వ్యాయామాలను ఉపయోగించినట్లు ఆధారాలు ఉన్నాయి.



ఫిజియోథెరపీ రంగం అభివృద్ధి

అమెరికాలో 1917లో 'ఫిజికల్ థెరపిస్ట్'లకు ఒక సంస్థ స్థాపించబడింది. అనేకమంది పరిశోధకులు, వైద్య నిపుణుల కృషి వల్ల ఫిజియోథెరపీ రంగం బాగా అభివృద్ధి చెందింది. ఇటీవలి కాలంలో, ఫిజియోథెరపీ ప్రపంచంలోని మూడవ అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ వృత్తిగా మారింది. పులివెందులలో బాలాజీ ఫిజియోథెరపీ క్లినిక్, లైఫ్ కేర్ ఫిజియో క్లినిక్,సుధీర్ అడ్వాన్స్ డ్ ఫిజియోథెరపీ క్లినిక్, రిలీవ్ ఫిజియో థెరపీ, రిహాబిలిటేషన్ క్లినిక్ వేంపల్లిలో శ్రీ హరి ఫిజియోథెరపి క్లినిక్, రిహాబిలిటేషన్ సెంటర్ ఇంకా కొన్ని క్లినిక్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.